RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక
నేటి ప్రసాదం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలుగు రాష్ట్రాల్లో
విలేకరులు కావలెను.
అర్హతలు:
• పత్రికారంగంలో అసక్తి కలిగి ఉండాలి.
• తెలుగు భాషపై పట్టు ఉండాలి.
• రిపోర్టింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.
• స్థానిక సంఘటనలు వెలికితీసే అవగాహనం ఉండాలి.
• సమాజ సేవ చేయగల ఉత్సాహం ఉండాలి.
• అనుభవం లేనివారికి శిక్షణ ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి:
+91 90004 05386

హైదరాబాద్ | మంగళవారం 28-7-2026 | సంచిక: 13 | సంఖ్య: 300 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి



## సమన్వయం లేదు.. కలహాలు పెరిగాయి

- ప్రభుత్వం, పార్టీ మధ్య కలహాలు పెరిగినట్లు నివేదికలొచ్చాయి..
- ఎమ్మెల్యేలపై వారికి దృష్టి లేదు
- సమన్వయం చేసుకోకుంటే మేమే రంగంలోకి దిగుతాం..
- పార్టీలో సమన్వయ లోపాలను సరిదిద్దేలా చర్యలకు మీనాక్షికి ఆదేశం
- రేపు ఢిల్లీలో పీసీసీ సమన్వయ కమిటీ సమావేశం
- సీఎం, పీసీసీ చీఫ్, ఇన్‌చార్జిల భేటీలో కాంగ్రెస్ అధిష్టానం హెచ్చరికలు

# కాళేశ్వరంపై ఉద్దేశపూర్వక రాజకీయాలు



నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నారైతులకు అందించడం లేదు

కాళేశ్వరంపై ఇచ్చింది ఎన్‌డీఏ రిపోర్ట్ అంటూ ఎద్దేవా

న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద తగిన నీటి

2లో

## పొగాకు రైతుల పేరుతో హడావుడి సమీక్ష

వైఎస్ జగన్ ప్రకటనతో ప్రభుత్వంలో కదలిక

ధరల స్థిరీకరణ, రైతుకు మద్దతు ధరపై చర్చ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులను ఆదుకుంటాయని వెల్లడి



అమరావతి: పొగాకు రైతుల సమస్యలపై ఇన్నాళ్లు స్పందించని రాష్ట్ర ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రైతులు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్న తర్వాత ప్రభుత్వంలో ఒక్కసారిగా కదలిక వచ్చింది. రైతులకు అండగా ఉంటానని, పది రోజుల్లో

2లో

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన పెంచాలి

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

ప్రాంతాల వారీగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

పంటల బీమా కార్యాచరణ ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలి


విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

1న భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

సమన్వయంతో కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆదేశం

అమరావతి: ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖలపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ఈ ఏడాది పొడవునా ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని అంచనాలు ఉన్న నేపథ్యంలో ఇప్పటికే చేపట్టిన

2లో



## పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్ర అస్వస్థత..

యశోదా ఆసుపత్రికి వెళ్లిన కేసీఆర్!

యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుదర్శన్ రెడ్డి

అరగంట పాటు ఆసుపత్రిలో గడిపిన వైద్యులు

మెదడు పనితీరు సాధారణ స్థితికి రావాల్సి ఉందన్న వైద్యులు

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై



2లో

## సింగరేణిని కేసీఆర్ దారుణంగా మోసం చేశారు: కిషన్ రెడ్డి



సింగరేణి దక్షిణాదిలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అన్న కిషన్ రెడ్డి

నాలుగు రాష్ట్రాలతో పాటు ఎన్టీపీసీకి బొగ్గు సరఫరా చేస్తోందని వెల్లడి

కేసీఆర్ పాలనలో సింగరేణిని రాజకీయ వేదికగా మార్చేశారని మండిపాటు

2లో

## ఏపీ డీఎస్సీపై కేంద్రం స్పందన

పారదర్శకంగా, ఆన్‌లైన్ విధానంలో నియామకాలు చేపట్టాలని రాష్ట్రాలకు సూచన

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు మిథున్‌రెడ్డి, తనూజారాణి ప్రశ్నలకు కేంద్రం జవాబు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ ఉపాధ్యాయ నియామక పరీక్షలో ప్రశ్నాపత్ర భద్రత, నియామక విధానం, క్రీడాకోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్ర

2లో





# హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగింపునకు ఆదేశాలు

హైకోర్టు సంచలన నిర్ణయం..

ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సూచన

చీఫ్ సెక్రటరీకి కోర్టు స్పష్టమైన ఆదేశాలు

లోతుకుంబ భూవ్యవహారంపై విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు

63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తీవ్ర ఆగ్రహం

బేషరతు క్షమాపణలు తెలిపిన రంగనాథ్

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వరుసగా కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదవుతున్న నేపథ్యంలో ఆయన్ను కమిషనర్ పదవి నుంచి



2లో



## లోక్‌సభలో పేపర్‌లీకేజీల బిల్లు

లీకేజీ వ్యక్తిగత నేరగాళ్లకు గరిష్టంగా పదేళ్ల జైలు, రూ. 50 లక్షల జరిమానా

వ్యవస్థీకృత నేరగాళ్లకు గరిష్టంగా ఏడేళ్ల జైలు, రూ. 10 కోట్ల జరిమానా

అన్ని రాష్ట్రాలు, యూటీల్లో లీకేజీ కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు

విపక్షాల నిరసనల మధ్యే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక నీట్ వంటి కీలక పోటీపరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలతో ఉద్యమించిన విద్యార్థిలోకాన్ని శాంతింపజేసేందుకు, లీకేజీ నేరగాళ్ల వెన్నులో వణుకుపుట్టేలా అత్యంత

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# కాళేశ్వరంపై ఉద్దేశపూర్వక రాజకీయాలు

మట్టం ఉన్నందున పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోయే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం రైతులకు నీరు అందించడం లేదన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో గ్రౌటింగ్ పూర్తయిన తర్వాత పరిమిత స్థాయిలో నీటిని నిల్వ ఉంచి మూడు పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని రిటైర్డ్ ఇంజినీర్లు సూచించారని తెలిపారు. సోమవారం కేటీఆర్ ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదిక రాజకీయ ప్రేరేపితమైందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే 48 గంటల్లో నివేదిక ఇచ్చారని, అందుకే దానిని బీఆర్‌ఎస్ ఎన్‌డీఎస్‌ఏ రిపోర్ట్ కాదు ఎన్‌డీఏ రిపోర్ట్ అని ఎద్దేవా చేశారు. రూ. 8.5 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మిస్తే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని ప్రభుత్వ ఇంజినీర్లు నివేదిక ఇచ్చినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తుమ్మిడిహెట్టి సాధ్యం కాకపోవడంతోనే నిపుణుల సూచనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేశామని చెప్పారు.

**ఐటీ ఉద్యోగాలు తగ్గాయి**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీ ఉద్యోగాల సంఖ్య తగ్గిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం ఐటీ టవర్లను కాంగ్రెస్ ప్రభుత్వం వినియోగించుకోవడంలో విఫలమైందన్నారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీల్లో యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వకపోవడంతో ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని విమర్శించారు. టీ--ఫైబర్ ప్రాజెక్టును పూర్తి చేస్తే ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ ఉద్యోగాలు పెరుగుతాయని తెలిపారు. కొత్తపల్లి--మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు రెండున్నరేళ్లుగా నిలిచిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్--కరీంనగర్ రైల్వే మార్గం విద్యుద్దీకరణతోపాటు మిడ్ మానేరు వద్ద రైల్వే కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మాణాన్ని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ సాధించిన విజయం తెలంగాణ యువత ప్రతిభను ప్రపంచానికి చాటిందని కేటీఆర్ అన్నారు.

**అర్ధరాత్రి బీజేపీతో కాంగ్రెస్ దోస్తీ:** ఢిల్లీలో కాంగ్రెస్, బీజేపీ మధ్య అంతర్గత అవగాహన ఉందని, అర్ధరాత్రి వేళల్లో కాంగ్రెస్ నేతలు బీజేపీ నాయకులతో రహస్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో ఈడీ సోదా లు జరిగినా వివరాలు బయటకు రాకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అక్కడ దొరికిన నగదును లెక్కించడానికి మిషన్లు కూడా సరిపోవట్లేదంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగింపునకు ఆదేశాలు

తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని చీఫ్ సెక్రటరీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం సహించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోతుకుంట పరిధిలోని సర్వే నంబర్ 1, 2లలో ఉన్న 40 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవహారం విచారణకు వచ్చిన సందర్భంగా రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఆ భూమిలోకి హైడ్రా సిబ్బంది ప్రవేశించలేదని, ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని అందులో పేర్కొన్నారు. వాస్తవాలను వక్రీకరించి పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కోర్టులు, న్యాయవ్యవస్థపై తమకు అత్యున్నత గౌరవం ఉందని పేర్కొంటూ జరిగిన పరిణామాలకు బేషరతుగా క్షమాపణలు కోరారు. అయితే రంగనాథ్ వివరణతో సంతృప్తి చెందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రంగనాథ్‌పై ఇప్పటికే దాదాపు 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయని గుర్తు చేసింది. ఒకే అధికారిపై ఇన్ని కోర్టు ధిక్కరణ కేసులు ఎందుకు నమోదవుతున్నాయని ప్రశ్నించింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులను పాటించకుండా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందా అని ప్రభుత్వ న్యాయవాదిని నిలదీసింది.

## పొగాకు రైతుల పేరుతో హడావుడి సమీక్ష



(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించి సమస్యల ను ప్రత్యక్షంగా తెలుసుకుంటానని వైఎస్ జగన్ ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం హడావుడిగా సమీక్ష నిర్వహించి, రైతులను ఆదుకుంటున్నామనే సంకేతాలిచ్చేందుకు ప్రయత్నించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమ వారం హడావుడిగా నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పొగాకు ధరల స్థిరీకరణ, రైతులకు మద్దతు అంశాలపై చర్చించారు. పొగాకు కొనుగోళ్లకు కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మద్దతిచ్చేందుకు అంగీకరించాయని, ధరల లోటు భర్తీ కింద కిలోకు రూ. 15 చొప్పున కేంద్రం, రూ. 5 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కలిపి.. రూ. 20 చొప్పున రైతులకు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ పథకం కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ. 188 కోట్లు భరించనున్నట్లు తెలిపారు. మొత్తం 94 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లకు ఈ మద్దతు వర్తించేలా చర్యలు చేపడతామన్నారు. బ్రైట్ గ్రేడ్ పొగాకు ధర కిలోకు రూ. 240, మీడియం గ్రేడ్ రూ. 190, లోగ్రేడ్ రూ. 110 కంటే తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు ఆదేశాలిచ్చారు. పొగాకు రైతుల సమస్యలపై రెండు రోజుల కిందట కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్‌తో సమావేశమైనట్లు వెల్లడించారు. అయితే ఈ నిర్ణయాల వెనుక నిజంగా రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఉందా? లేక రాజకీయపరమైన ఒత్తిడి కారణంగానే ప్రభుత్వం స్పందించిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల హామీల తరహాలో ప్రకటనలు చేయడం కాకుండా, రైతులకు వాస్తవంగా నిధులు ఎప్పుడు చేరతాయి? బయ్యర్లు ప్రకటించిన ధరలను నిజంగా అమలు చేస్తారా? ధరల లోటు భర్తీని ఏ విధానంలో చెల్లిస్తారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎల్‌నినోపై రైతులకు అవగాహన పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

చర్యలతో పాటు రైతులకు మరింత సమాచారాన్ని అందించాలని తెలిపారు. ప్రాంతాల వారీగా అనుకూలమైన పంటల సాగుపై రైతులకు మార్గనిర్దేశం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. పంటల బీమా కార్యాచరణ ప్రణాళికను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. రంపచోడవరంలో విద్యార్థిని శివాని ఆత్మహత్య ఘటనపై సీఎం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి నిపుణుల సేవలను వినియోగించుకోవడంతో పాటు ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థుల మానసిక స్థితిని గుర్తించేందుకు సైకోమెట్రిక్ పరీక్షలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమావేశంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం ప్రారంభం కానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, అతిథుల స్వాగతం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు

**న్యూ ఢిల్లీ జులై 27:** శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, దాన్ని ఎవరికీ నిరాకరించే అవకాశం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆందోళనలు జరుగుతున్నాయనే కారణంతో పోలీసులు అతిగా బలప్రయోగం చేయడాన్ని సమర్థించలేమని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనల నిర్వహణకు సంబంధించి ఏకరూప మార్గదర్శకాలు రూపొందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కూడా వెల్లడించింది. నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల వ్యవస్థలో అక్రమాలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్, టియర్‌గ్యాస్ ప్రయోగించారంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది.'శాంతియుత నిరసన హక్కు రాజ్యాంగంలో పొందుపరచబడింది. అది సంపూర్ణంగా హామీ ఇవ్వబడిన హక్కు. దాన్ని ఎవరూ నిరాకరించలేరు. కేవలం ఆందోళనలు జరుగుతున్నాయనే కారణంతో పోలీసుల అతిగా బలప్రయోగాన్ని సమర్థించలేం. ఎవరైనా శాంతియుతంగా ఆందోళన చేయాలనుకుంటే అందుకు ఒక నిర్దిష్ట ప్రోటోకాల్ ఉండాలి. అలాంటి నిరసనలకు తగిన స్థలాన్ని కూడా కల్పించాలి. అందులో ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే సంఘవిద్రోహ శక్తులు చొరబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు.

# సమన్వయం లేదు.. కలహాలు పెరిగాయి

న్యూఢిల్లీ: రాష్ట్ర పార్టీలో పెరుగుతున్న అసంతృప్తి జ్వాలలు, అంతర్గత పోరుపై కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం కొరవడటం.. జిల్లాల్లో మంత్రుల ఏకఛత్రాధిపత్యం.. ఎమ్మెల్యేల నియోజకవర్గాల స్థాయి అభివృద్ధి పనుల్లో జాప్యంపై వరుసగా వస్తున్న ఫిర్యాదులపై రాష్ట్ర నాయకత్వాన్ని గట్టిగా ప్రశ్నించినట్లు సమాచారం. కొన్ని నెలలుగా జిల్లాల స్థాయి నుంచి రాష్ట్ర నాయకత్వం వరకు చోటుచేసుకుంటున్న పరిణామాలను పరిశీలించిన కాంగ్రెస్ హైకమాండ్, ప్రభుత్వం--పార్టీ మధ్య సమన్వయం గాడి తప్పుతోందనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జితో జరిగిన సమావేశంలో పార్టీ వ్యవహారాలపై స్పష్టమైన హెచ్చరికలు చేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

**అందరిదీ సొంత అజెండానే..**

రాష్ట్ర పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు సహా భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సోమవారం పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇంచార్జి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వ పరిస్థితి, సంస్థాగత వ్యవహారాల, ఎస్‌ఐఆర్ కొనసాగుతున్న తీరుపై రెండు గంటలపాటు చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి తెప్పించుకున్న నివేదికలు, ఇంచార్జీలు ఇచ్చిన నివేదికలపై అధిష్టాన పెద్దలు సమీక్షించారు. ప్రభుత్వ నిర్ణయాలు పార్టీ శ్రేణులకు చేరడం లేదని, పార్టీ నుంచి వచ్చే అభిప్రాయాలు ప్రభుత్వానికి వెళ్లడం లేదని, మంత్రులు--ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కొరవడిందని వచ్చిన నివేదికలపై గట్టిగానే చర్చ జరిగినట్లు సమాచారం. చాలామంది మంత్రులు తమ తమ శాఖలు, నియోజకవర్గాలకే పరిమితమవుతున్నారని, జిల్లాల వారీగా పార్టీని సమన్వయం చేసే బాధ్యత కనిపించడం లేదన్న అభిప్రాయాన్ని పార్టీ పెద్దలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా మంత్రులు సొంత నియోజకవర్గాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, నిధుల కేటాయింపుల్లోనూ వారికి ప్రాధాన్యమిచ్చుకుంటూ జిల్లా ఎమ్మెల్యేలను పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు అందాయని రాష్ట్ర నేతల దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. మంత్రుల స్థాయిలోనూ, కార్పొరేషన్ పదవుల్లో ఉన్న నేతలు తమ సొంత అజెండా, సొంత ఇమేజ్‌ను పెంచుకునే ప్రయత్నాలు తప్ప, పార్టీ ఇమేజ్‌కు పెద్దగా దోహదం చేయడం లేదన్న అంశంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఈ సందర్భంగానే ఎస్‌ఐఆర్ ప్రక్రియలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతల భాగస్వామ్యం కొరవడిందన్న అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. షబ్బీర్..సామేల్..డీసీసీల వ్యవహారాలపై ప్రశ్నలు తమకు అందించిన నివేదికల్లోని అంశాలను ప్రస్తావిస్తూ కేసీ వేణుగోపాల్ రాష్ట్ర నేతల నుంచి వివరణ కోరినట్లు తెలిసింది.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి తీవ్ర అస్వస్థత..

సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం తెలిసిందే. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్ ఆసుపత్రికి వెళ్లారు. దాదాపు అర్ధగంట పాటు అక్కడే ఉండి వైద్యులను అడిగి సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రస్తుతం సుదర్శన్ రెడ్డికి అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని, అవసరమైతే విదేశీ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని కేసీఆర్ కు వైద్యులు వివరించారు. ఆయన అవయవాలన్నీ సరిగ్గా పనిచేస్తున్నాయని, మెదడు పనితీరు సాధారణ స్థితికి రావలసి ఉందని, దీనిపై స్పష్టత రావడానికి మరో 48 గంటల సమయం పడుతుందని తెలిపారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఎంత ఖర్చయినా సరే మెరుగైన వైద్యం అందించి పూర్తి కోలుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. వైద్యుల కృషి, దైవానుగ్రహం, ప్రజల ప్రార్థనలతో ఆయన త్వరలోనే కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఏం చేస్తారో ఏమో తెలీదు.. మా పెద్ది సుదర్శన్ రెడ్డిని మాత్రం కాపాడండి" అని వైద్యులకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు.

# ఏపీ డీఎస్సీపై కేంద్రం స్పందన

ప్రభుత్వం స్పందించింది. ఉపాధ్యాయుల నియామకాలు, వారి సేవా నిబంధనలు, నియామక ప్రక్రియ పూర్తిగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల పరిపాలన పరిధిలోనే ఉంటాయని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి తెలిపారు. లోక్‌సభలో సోమవారం వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి, పార్టీ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి ప్రశ్నలకు మంత్రి జవాబిస్తూ.. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ దేశంలోని ఎక్కువ పాఠశాలలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన నియంత్రణలో ఉంటాయని తెలిపారు. అందువల్ల ఉపాధ్యాయుల నియామకాలు, సేవా నిబంధనలు, పోస్టింగ్‌లకు సంబంధించిన అంశాలు వాటి పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. అయితే ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను పారదర్శకంగా, పటిష్టంగా, సాధ్యమైనంతవరకు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచనలు జారీచేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో పారదర్శకత, విశ్వసనీయత పెంపొందించడంతో పాటు అక్రమాలను అరికట్టేందుకు పార్లమెంట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం--2024ను తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రాలు తమ అవసరాలకు అనుగుణంగా అనుసరించేందుకు ఇది ఒక నమూనా చట్టంగా ఉపయోగపడుతుందని వెల్లడించారు. మెగా డీఎస్సీకి సంబంధించి రాష్ట్రంలో జరిగిన అవినీతి, అన్యాయాలపై ఎంపీలు అడిగిన ప్రశ్నకు మాత్రం కేంద్రమంత్రి జవాబివ్వలేదు.

## లోక్‌సభలో పేపర్‌లీకేజీల బిల్లు



కఠిన శిక్షలు, అత్యధిక జరిమానాలతో నూతన చట్టానికి తుదిరూపునిచ్చి సంబంధిత బిల్లును మోదీ సర్కార్ సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పరీక్షలు(అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు,2026ను ప్రధానికార్యాలయానికి సహాయ మంత్రి అయిన జితేంద్ర సింగ్ సోమవారం లోక్‌సభలో విపక్షాల నిరసనల మధ్యే ప్రవేశపెట్టారు. బిల్లు ప్రతిపాదించేముందు నిబంధనల ప్రకారం సీనియర్ విపక్ష సభ్యులైన సౌగతా రాయ్(టీఎంసీ), మనీశ్ తివారీ(కాంగ్రెస్), ఎన్‌కే ప్రేమచంద్రన్(ఆర్‌ఎస్పీ)లను బిల్లుపై మాట్లాడాల్సిందిగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరారు. దానికి వాళ్లు ముందుకురాకపోవడంతో ఇక బిల్లును ప్రవేశపెట్టాలని సహాయమంత్రి జితేంద్రను స్పీకర్ కోరడంతో ఆయన బిల్లును సభముందుకు తెచ్చారు. వెంటనే స్పీకర్ మాట్లాడారు. "ప్రభుత్వ పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు తెస్తున్న బిల్లు ఇది. మీరు నినాదాలు ఆపేసి బిల్లుపై చర్చలో పాల్గొంటే బాగుంటుంది. చర్చ వేళ మీరు ఇచ్చే సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనుంది" అని స్పీకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, దాని ఏజెన్సీలు నిర్వహించే పబ్లిక్ ఎగ్జామ్‌లో అవకతవకలకు పాల్పడే వాళ్లను ప్రత్యేక చట్టాల కింద శిక్షించేందుకు మోదీ సర్కార్ 2024లో పబ్లిక్ ఎగ్జామ్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం తెచ్చింది. యూపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వేస్, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇతర ప్రభుత్వ సంస్థలు చేపట్టే పరీక్షల పేపర్లను లీక్‌చేసే వాళ్లను, ముఠాలను ఈ చట్టనిబంధనల కింద శిక్షిస్తున్నారు. తాజాగా నీట్ లీకేజీ ఉదంతం, విద్యామంత్రిగా ధర్మేంద్ర రాజీనామా డిమాండ్లు, విద్యార్థి నిరసనోద్యమంలో మోదీ సర్కార్ చట్టసవరణ చేస్తూ కొత్త బిల్లును తేవడం తెల్సిందే.

## సింగరేణిని కేసీఆర్ దారుణంగా మోసం చేశారు: కిషన్ రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి సంస్థను తీవ్రంగా మోసం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి దక్షిణాదిలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అని, తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలతో పాటు ఎన్టీపీసీకి ఇది బొగ్గును సరఫరా చేస్తోందని గుర్తుచేశారు.(గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన స్వార్థ రాజకీయాల కోసం సింగరేణిని వాడుకుని, దానికి తీవ్ర ఆర్థిక నష్టాన్ని చేకూర్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ సంస్థలో 49 శాతం వాటా, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందన్న ఆయన... కేసీఆర్ పాలనలో సింగరేణిని ఒక రాజకీయ వేదికగా మార్చేసి, దాని ఆదాయానికి కోలుకోలేని గండి కొట్టారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధిని పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ సింగరేణి పరిస్థితిలో పెద్దగా మార్పు ఏమీ రాలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, సింగరేణి పునరుద్ధరణకు, కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కిషన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# మేడ్చల్ పెద్ద చెరువు, తుమ్మ చెరువును పరిరక్షించాలి

## మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్



**మేడ్చల్, జూలై 27: (నేటి ప్రస్థానం):** మేడ్చల్ ప్రజలకు జీవనాధారంగా ఉన్న పెద్ద చెరువు, తుమ్మ చెరువులను ఆక్రమణలు, మురుగునీరు, చెత్తాచెదారం నుంచి రక్షించాలని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సోమవారం మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ, చెరువుల పరిరక్షణ కోసం పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. పెద్ద చెరువు, తుమ్మ చెరువుల్లోకి మురుగునీరు చేరడం, చెత్తాచెదారం పేరుకుపోవడం, శిఖం భూములు ఆక్రమణలకు గురికావడం, శిఖం ఆనుకొని అక్రమ వెంచర్లు వెలుస్తున్నా సంబంధిత శాఖలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి చెరువులను కాపాడాలని కోరారు. వినతిపత్రంలో పెద్ద చెరువు, తుమ్మ చెరువుల్లోకి వస్తున్న మురుగునీటిని వెంటనే నిలిపివేయాలని, చెత్తాచెదారాన్ని తొలగించాలని, శిఖం భూములపై జరిగిన ఆక్రమణలను తొలగించాలని, అక్రమ వెంచర్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, చెరువుల పరిరక్షణలో విఫలమైన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని, చెరువుల హద్దులను సర్వే చేసి శాశ్వత సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు, ధర్నాలు, ముట్టడులు నిర్వహించడంతో పాటు అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని జల్లి శైలజ హరినాథ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీ గుప్త, మేడ్చల్ రూరల్ జిల్లా బీజెవైఎం అధ్యక్షులు రాగం అర్జున్, జిల్లా బీజెవైఎం నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, కార్యదర్శులు బండి విష్ణు, డీ.సాయి, సత్యనారాయణ రెడ్డి, కార్యవర్గ సభ్యులు దగ్గు రాజు, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి సీనియర్ నాయకులు థాత్రిక లక్ష్మణ్, చీర్ల సత్యనారాయణ, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, బొజ్జ వంశీ రెడ్డి, నాయకులు జకట బాబు రాజు, మహేష్ గౌలికర్, గోపు నాగరాజు, సదామణి నరేందర్, మామిళ్ళ నర్సింగ్, అవినాష్ చారి, రతన్ రాథోడ్, ఎన్.ఎస్.గౌడ్, సందీప్ యాదవ్, పురుషోత్తం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.




సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ పట్టణం 297 డివిజన్ లో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు,నోట్ పుస్తకాల పంపిణీ



**మేడ్చల్ 27 (నేటి ప్రస్థానం):** ఆర్ఆర్ ఫౌండేషన్ (RR Foundation) అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వహస్తాలతో ఈ విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో, వారికి తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కూడా ఆర్ఆర్ ఫౌండేషన్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాఘవేంద్ర గౌడ్ చేసిన ఈ ఉదార సహాయాన్ని అభినందించారు. ప్రైవేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా ప్రభుత్వ స్కూల్ పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేయడం ద్వారా వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్ నూతన సీ.ఐ. అంజిరెడ్డిని సన్మానించిన మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి నాయకులు



**మేడ్చల్ 27( నేటి ప్రస్థానం):** మేడ్చల్ సీ.ఐ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డి గారిని మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి,మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్,మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షులు సర్వేశ్వర రెడ్డి,బీజెవైఎం జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి,మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి,డీ.సాయి,విష్ణు,కార్యవర్గ సభ్యులు దగ్గు రాజు,నాయకులు అనిల్,గోపు నాగరాజు,సదామణి నరేందర్,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ స్టార్స్ యూత్ అసోసియేషన్‌అధ్వర్యంలో మల్లారెడ్డిగూడెం పాఠశాల విద్యార్థులకు కుర్చీలు అందజేత

**సంస్థాన్ నారాయణపూరశీ, జూలై 27:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూరశీ మండల మల్లారెడ్డిగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కుర్చీలు అందజేశారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యుల సేవా భావాన్ని అభినందించి, విద్యార్థుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులు గంట నవీన్ , కద్దుల గోపి , వీరమల్ల వేణు, బాతరాజు లాలూ , నర్రీ మహేష్,పందుల నాగరాజు , గుండ్లపల్లి శివ , వీరమల్ల బన్నీ , నర్రీ నవీన్ , నర్రీ రాజు , నర్రీ చందూ దోంతరగోనీ చంటి తదితరులు పాల్గొన్నారు...

# గ్రామీణ వైద్యుల సంక్షేమాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం

**ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి ● తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్**







**ఖమ్మం:** గ్రామీణ వైద్యుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని గ్రామీణ వైద్యులకు ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను త్వరతగతిన నెరవేర్చాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ డిమాండ్ చేశారు. మండలంలోని గ్రామీణ వైద్యుల శిక్షణ తరగతులను అదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గ్రామీణ వైద్యులకు జీఓ 428 తీసుకువచ్చి గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చారని అన్నారు. రద్దు చేసిన జీఓను వునరుద్ధరించి గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి కాంగ్రెస్ చిత్తశుద్ధి చాటుకోవాలని అన్నారు. ఎన్నికల సమయంలో గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. గ్రామీణ వైద్యులకు చట్టబద్ధ గుర్తింపు కల్పించాలని అన్నారు. ఆర్ఎంపీలపై జరుగుతున్న వేధింపులు అక్రమ కేసులు దాడులను పూర్తిగా నిలిపివేయాలని అన్నారు. గ్రామీణ వైద్యుల సంక్షేమానికి ప్రత్యేక విధానం రూపొందించి ప్రభుత్వంతో చర్చలు ప్రారంభించాలని కోరారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో తగిన స్థానం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నవరపు నాగేశ్వరరావు రాష్ట్ర ఉపాధ్యక్షులు నారోపోగు వీరభద్రం జిల్లా అధ్యక్షులు మర్రి నరేష్ జిల్లా ఉపాధ్యక్షులు చాపలమడుగు నాగేశ్వరరావు జిల్లా గౌరవ అధ్యక్షులు శీలం బాలకృష్ణరెడ్డి జిల్లా న్యాయ సలహదారులు కాకాటి కరుణాకర్ జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు తుప్పాతి శ్రీనివాస్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ మారుతి సంపత్ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంపల్లి సురేష్ మండల అధ్యక్షులు గుర్రం సురేష్ మండల ఉపాధ్యక్షులు మాతంగి రామ్ కిరణ్ ప్రధాన కార్యదర్శి ఘట్టం వంశీ కార్యవర్గ సభ్యులు మరీదు వినయ్ గౌరవ అధ్యక్షులు మణిరాజ్ కార్యవర్గ సభ్యులు గోపి ఏ ఏసు పోగు దేవిడ్ పండు, పరుశురాం రామకృష్ణ ఆయా మండలాల నాయకులు బత్తుల రాజ్ కుమార్ ఆర్ వి బి చారీ కొరకప్పు వెంకటేష్ దోర్నాల లోకేష్ కోట సురేష్ చక్రి తదితరులు పాల్గొన్నారు.

# పడకల్ గ్రామపంచాయతీ ఆవరణలో జలసిరి పై ప్రత్యేక గ్రామసభ

**తలకొండపల్లి జులై 27:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జలసిరి కార్యక్రమంపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తలకొండపల్లి ఎంపీడీవో సీతారామమ్మ మాట్లాడుతూ, వర్షపాతం తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలను, రైతులను ముందస్తుగా అప్రమత్తం చేయడానికే ఈ అవగాహన సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూగర్భ జలాలను పెంపొందించుకోవడానికి ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల వాకిళ్ల లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. అలాగే ఐదు ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులందరూ ఫార్మ్ పాండ్ల (కృత్రిమ నీటి కుంటలు) కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయ అధికారి (ఏఈఓ) త్రిలోక్య మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, బీఎల్వో లు, బీఎల్ఏ లు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## బండి భిక్షయ్య కుటుంబానికి బీజేపీ నాయకుడు శానమోని పాండు ప్రసాద్ 50 కేజీల బియ్యం అందజేత

**తలకొండపల్లి జులై 27:** జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పిలుపు మేరకు తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన దివంగత బండి భిక్షయ్య కుటుంబానికి బీజేపీ జిల్లా కార్యదర్శి శానమోని పాండు ప్రసాద్ ఆర్థిక, నిత్యావసర సాయం అందించారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన బండి భిక్షయ్య దశదిన కర్మ (దినకార్యక్రమం) నిమిత్తం ఆయన కుటుంబానికి ఆసరాగా 50 కేజీల బియ్యాన్ని. రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాండు ప్రసాద్ అందజేశారు. కష్టకాలంలో ఉన్న పేద కుటుంబాలకు తమవంతు సహాయం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పోతుగంటి మహేష్. బీజేపీ సీనియర్ నాయకులు బండి యాదయ్య. నాయకురాలు బండి శాంతకుమారి బూత్ అధ్యక్షుడు శ్రీను. నాయకులు బండి పాండు, రాములు. తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక





## ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### ప్రజావాణికి 12ఫిర్యాదులు ..ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి

**మిర్యాలగూడ జూలై 27::** మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఆర్డిఓ రమణారెడ్డి డివిజన్ పరిధిలోని వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. డివిజన్ స్థాయి పరిధిలో ఏ శాఖ పరిధిలోనైనా సమస్య ఉన్నట్లయితే ప్రజావాణి ద్వారా తమ విన్నవించుకోవాలని, ఆయా సమస్యలను సంబంధిత శాఖ ద్వారా సత్వర పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తం 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వివరించారు. మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ కు 3, పెద్దవూర తహసిల్దార్ కార్యాలయంకు ఒకటి, మాడుగులపల్లి తహసిల్దార్ కార్యాలయం ఒకటి, తహసిల్దార్ కార్యాలయం నిడమనూరు 1, త్రిపురారం తహసిల్దార్ కార్యాలయం 2, వేములపల్లి తహసిల్దార్ కార్యాలయం ఒకటి, దామరచర్ల తహసిల్దార్ కార్యాలయం ఒకటి, మిర్యాలగూడ మున్సిపాలిటీకి 1, మిర్యాలగూడ ఆర్ అండ్ బి డిఇకు ఒక ఫిర్యాదులు అందాయని ఆర్డిఓ రమణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో డిఎఓ శ్రీనివాస్ శర్మ, నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎండి. అహ్మదుల్లా, బిక్షం, జనార్ధన్, ఉద్యానవన శాఖ అధికారి నసీమా మెహ్రిన్, విద్యుత్ సబ్ ఇంజనీర్ నవీన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గడి పెద్దాపూర్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ..




**అల్లాదుర్గం:** అల్లాదుర్గం.. మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామములో ( ఎమ్ఆర్ఆర్) నిధుల కింద ప్రభుత్వం 95 లక్షలు మంజూరు చేయడంతో సోమవారం రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వట్టిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి హాజరై రోడ్డు పనులను ప్రారంభించారు.. రోడ్డు పనులకు నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గ్రామ సర్పంచ్ హరికృష్ణ, మాజీ ఎంపిటిసి విట్టల్ రెడ్డి లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, మండల సర్పంచులు ఫోరం అధ్యక్షులు నర్సారెడ్డి, జిల్లా కార్యదర్శి బాల కిషన్, కాంగ్రెస్ నాయకులు సురేష్ గుప్తా, అభిలాష్ రెడ్డి, చంద్రశేఖర్, రాజు గౌడ్, సాయిబాబా, విశ్వేశ్వర్ భూశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను బీసీ--డీ నుంచి బీసీ--ఏలోకి మార్చాలి

### ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుర్రాల బాలకృష్ణ



ఆలేరు జులై 27: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ--డీ (దీజ-ఞ) వర్గం నుంచి బీసీ--ఏ (దీజ-ూా) వర్గంలోకి మార్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గుర్రాల బాలకృష్ణ ముదిరాజ్ డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో జనాభా పరంగా ముదిరాజ్ సామాజిక వర్గం అత్యధికంగా ఉన్నప్పటికీ, విద్య, ఉద్యోగాలు, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఇప్పటికీ తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు లభించక వెనుకబడి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముదిరాజ్‌లను బీసీ--ఏ వర్గంలోకి చేర్చడం ద్వారా మాత్రమే వారికి రాజ్యాంగబద్ధమైన సామాజిక న్యాయం అందుతుందని అభిప్రాయపడ్డారు.అదేవిధంగా ముదిరాజ్‌లకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవులు, నామినేటెడ్ పోస్టులు, సంక్షేమ పథకాలు, కార్పొరేషన్లు తదితర అన్ని రంగాల్లో తగిన వాటా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి ముదిరాజ్‌ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.ముదిరాజ్ సమాజం అభివృద్ధి చెందాలంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బీసీ--ఏలోకి మార్పు అంశంపై ఆలస్యం చేయకుండా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తక్షణమే అమలు చేయాలని ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు




# భూసేకరణ సెగ!

## భూములు ఇచ్చేది లేదని తేల్చిచెప్పిన 117 మంది రైతులు

### 66 ఎకరాల భూసేకరణపై తీవ్ర అభ్యంతరం..

### భూమి తీసుకోవాలంటే రైతు కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

### తహసీల్దార్ పరమేశానికి వినతి.. కలెక్టర్ ప్రతీక్ జైన్‌కూ ఫిర్యాదు




**గుమ్మడిదల, జూలై 27 ( నేటి ప్రస్థానం):**

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలోని సర్వే నంబర్ 261/1 భూముల వ్యవహారం మరోసారి వేడెక్కింది. పారిశ్రామిక అవసరాల కోసం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక సమాచారం తెలుసుకున్న రైతులు ఒక్కతాటిపైకి వచ్చారు. టీజీఐఐసీకి తమ భూములు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. భూముల భూసేకరణ ప్రక్రియను నిలిపివేసి తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను కోరారు.

#### 117 మంది రైతులు.. 117 ఎకరాల భూమి

అన్నారం 261/1 పరిధిలో మొత్తం 117 మంది రైతులకు ఎకరా చొప్పున 117 ఎకరాల భూమి కేటాయించినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక సమాచారంలో 66 ఎకరాల భూమి ఉన్నట్లు తెలుసుకున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనాధారమైన భూములను పారిశ్రామిక అవసరాల కోసం తీసుకోవడం వల్ల భవిష్యత్తులో తమ కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### భూమి తీసుకుంటే.. ఉద్యోగం ఇవ్వాలి!

భూసేకరణకు అంగీకరించాలంటే కేవలం పరిహారం చెల్లించడం సరిపోదని రైతులు స్పష్టం చేశారు. భూమి కలిగిన ప్రతి రైతు కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రధాన డిమాండ్ చేశారు. భూమిని కోల్పోయిన తర్వాత తమ కుటుంబాల జీవనాధారం దెబ్బతినకుండా ప్రభుత్వం శాశ్వత భరోసా కల్పించాలని కోరుతున్నారు. భూమి మా జీవనాధారం.. భూమిని తీసుకుంటే మా కుటుంబాల భవిష్యత్తుకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి అని రైతులు స్పష్టం చేస్తున్నారు.

#### తహసీల్దార్‌కు వినతి.. కలెక్టర్‌కూ ఫిర్యాదు



భూసేకరణపై తమ అభ్యంతరాలను అధికారికంగా తెలియజేస్తూ సోమవారం అన్నారం రైతులంతా కలిసి తహసీల్దార్ పరమేశానికి వినతిపత్రం అందజేశారు. రైతులు సమర్పించిన వినతులను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక రాసి ఇస్తానని తహసీల్దార్ పరమేశం హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. అదే విధంగా తమ అభ్యంతరాలు జిల్లా స్థాయిలోనూ పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు కూడా రైతులు వినతిపత్రం సమర్పించారు.

#### 66 ఎకరాలపై కొనసాగుతున్న కదలికలు

సర్వే నంబర్ 261/1/1 నుంచి 261/1/68 వరకు 66 ఎకరాల భూమికి సంబంధించి పారిశ్రామిక అవసరాల కోసం భూసేకరణ ప్రక్రియకు సంబంధించిన చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తమయ్యారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు నంబర్ 44, తేదీ మార్చి 13, 2026 నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియపై రైతుల్లో ఆందోళన నెలకొంది. భూసేకరణకు ముందు రైతుల అభ్యంతరాలు, భూములపై హక్కులు, పరిహారం, పునరావాసం తదితర అంశాలను నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లవద్దని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

#### రైతుల అభ్యంతరాలపై అధికారుల నిర్ణయం ఏంటి?

ఒకవైపు పారిశ్రామిక అవసరాల కోసం భూసేకరణ ప్రక్రియ.. మరోవైపు "భూములు ఇచ్చేది లేదు" అంటూ రైతులు స్పష్టమైన వైఖరి తీసుకోవడంతో అన్నారం 261/1 భూముల వ్యవహారం ఉత్కంఠగా మారింది.తహసీల్దార్ పరమేశం ఇచ్చిన హామీ మేరకు జిల్లా కలెక్టర్‌కు అందే నివేదికలో రైతుల అభ్యంతరాలు ఏ మేరకు ప్రతిబింబిస్తాయి? కలెక్టర్ స్థాయిలో రైతుల డిమాండ్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? భూమికి బదులుగా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్న రైతుల ప్రధాన డిమాండ్‌పై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.రైతుల భూమి.. రైతుల హక్కు.. రైతుల భవిష్యత్తు --- ఈ మూడు అంశాల చుట్టూ అన్నారం 261/1 భూసేకరణ వ్యవహారం మరింత కీలకంగా మారింది.

## ఆర్ఓబి పనులు మరింత స్పీడప్ చేయండి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్:** కరీంనగర్-చొప్పదండి ప్రధాన రహదారిపై తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆర్ఓబి పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ఓబి నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతి, ఇప్పటికే పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బ్రిడ్జి నిర్మాణంతో పాటు నాలుగు వైపులా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్లు, భూసేకరణ ప్రక్రియ, డ్రైనేజీ, ఇతర అనుబంధ పనుల పురోగతిపై ఆరా తీశారు. పనులు వేగంగా సాగేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని, పనుల నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని, నిర్మాణ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సర్వీస్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, వాటి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన రెవెన్యూ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.ఆర్ఓబి పూర్తయితే కరీంనగర్-చొప్పదండి మార్గంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు రైల్వే గేటు వద్ద ఏర్పడే నిరీక్షణకు ముగింపు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు.

## హైడ్రా కమిషనర్ కు హైకోర్టులోఎదురు దెబ్బ

### రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలి

### సీఎస్‌ను ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం

హైద్రాబాద్ జులై 27: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. సెక్రటరీ ర్యాంకుస్థానంలో ఉన్న అధికారి కోర్టు ధిక్కరణ సరికాదన్న హైకోర్టు రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను ఓ ఉన్నతాధికారి ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని పేర్కొంది. కోర్టు ధిక్కరణపై హైకోర్టుకు రంగనాథ్ క్షమాపణలు చెప్పారు.

## శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు

### పోలీసుల భద్రత కూడా ముఖ్యమే

### దాన్ని ఎవరికీ నిరాకరించే అవకాశం లేదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

**న్యూ డిల్లి జులై 27:** శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, దాన్ని ఎవరికీ నిరాకరించే అవకాశం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆందోళనలు జరుగుతున్నాయనే కారణంతో పోలీసులు అతిగా బలప్రయోగం చేయడాన్ని సమర్థించలేమని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనల నిర్వహణకు సంబంధించి ఏకరూప మార్గదర్శకాలు రూపొందించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కూడా వెల్లడించింది. నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల వ్యవస్థలో అక్రమాలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్, టియర్‌గ్యాస్ ప్రయోగించారంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది.'శాంతియుత నిరసన హక్కు రాజ్యాంగంలో పొందుపరచబడింది. అది సంపూర్ణంగా హామీ ఇవ్వబడిన హక్కు. దాన్ని ఎవరూ నిరాకరించలేరు. కేవలం ఆందోళనలు జరుగుతున్నాయనే కారణంతో పోలీసుల అతిగా బలప్రయోగాన్ని సమర్థించలేం. ఎవరైనా శాంతియుతంగా ఆందోళన చేయాలనుకుంటే అందుకు ఒక నిర్దిష్ట ప్రోటోకాల్ ఉండాలి. అలాంటి నిరసనలకు తగిన స్థలాన్ని కూడా కల్పించాలి. అందులో ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే సంఘవిద్రోహ శక్తులు చొరబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. ఇది దేశవ్యాప్తంగా వర్తించే అంశం. ఒకే విధమైన ప్రోటోకాల్ అవసరం ఉంది. ఎవరి బాధ్యతలు ఏమిటి? ఎలాంటి తప్పనిసరి మార్గదర్శకాలు ఉండాలి? అనే విషయాలను పరిశీలిస్తాం. ఈ ప్రక్రియలో స్వీయ క్రమశిక్షణ కూడా చాలా ముఖ్యమైనది" అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు.

**పోలీసుల భద్రత కూడా ముఖ్యమే**

విచారణ సందర్భంగా విద్యార్థులపై పోలీసుల దాడులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీనియర్ న్యాయవాదులు గోపాల్ శంకరనారాయణన్, కాలిన్ గోన్సాల్వెస్, వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. మరోవైపు విచారణ సందర్భంగా నిరసనల్లో కొందరు పోలీసు సిబ్బందిపై కూడా దాడులు జరిగాయని ఒక న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జోయ్‌మాల్య బాగ్చి, "వారు ఎవరైనా సరే, ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనదే. పోలీసు సిబ్బంది భద్రత కూడా అంతే ముఖ్యమైనది. వారికి తగిన భద్రత ఎందుకు కల్పించలేదో రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరే అంశాన్ని కూడా పరిశీలిస్తాం" అని అన్నారు. పోలీసుల కుటుంబ సభ్యులు దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను కూడా ఇతర పిటిషన్లతో కలిసి విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది.

## అసలైన లబ్ధిదారులకు ఇల్లు ఇవ్వండి

### శాలివాహన నగర్ బస్తీవాసులు డిమాండ్

మూసి సుందరీకరణ లో భాగంగా ఇండ్లు పోగొట్టుకున్న అసలైన లబ్ధిదారులమైన తమకు ఇల్లు కేటాయించకుండా ఎంఐఎం నాయకులైన బలాల వారి అనుచరులకు అనుకూలమైన వ్యక్తులకు మాత్రమే ఇండ్లు కేటాయించి తమకు అన్యాయం చేశారని ముసారంబాగ్ శాలివాహన నగర్ అంబేద్కర్ నగర్ బస్తివాసులు ఆరోపించారు. అంతేకాకుండా అక్రమంగా కేటాయించిన ఇండ్లను కూడా అమ్ముకుంటున్నారని అన్నారు. చేయించుకున్నారు వెంటనే ప్రభుత్వం అసలైన లబ్ధిదారులైన తమకు ఇండ్లు కేటాయించి జరిగిన మొత్తం స్కామ్ మీద విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బకారం యాదగిరి,ఇందిరా,అశోక్,రాణి,స్వప్న, నాగయ్య దాదాపు 70 మంది బస్తీ వాసులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల కు సహకరించండి

### నాయకులకు వినతిపత్రం

కౌతాళం: అఖిల భారత విద్యార్థి సమైఖ్య టూ×ాఖీఊ ఆధ్వర్యంలో కర్నూల్ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబసవరాజ్ మరియు మండల అధ్యక్షులు సాయి వర్మ మాట్లాడుతూ కౌతాళం మండల కేంద్రంలో గురుకుల హాస్టల్ ను ఏర్పాటు చేయాలని సోమవారం మంత్రాలయం నియోజకవర్గం నాయకులు రాఘవేంద్ర రెడ్డి మరియు కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు కు వినతిపత్రం అందజేశారు.గురుకుల హాస్టల్ ను ఏర్పాటు చేయకపోతే విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏ ఐ ఎస్ ఎఫ్ డిమాండ్ చేశారు.నాయకులు స్పందిస్తూ గురుకుల హాస్టల్ ను కౌతాళం మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ ఐ ఎస్ ఎఫ్ మండల నాయకులు గంగారాం, ఖాదర్ మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లె బాటలో ఈగల్ కార్యక్రమాలు

### జొన్నగిరిలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం

### రచ్చబండ ద్వారా ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం

తుగ్గలి: జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో పల్లె బాటలో ఈగల్ కార్యక్రమంలో భాగంగా జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జొన్నగిరి గ్రామములో సోమవారం రోజున జొన్నగిరి ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున,ఈగల్ టీం సిబ్బంది మాట్లాడుతూ ఐవిఆర్ఎస్ కాల్స్‌లో పాజిటివ్ పర్సెప్షన్ తక్కువగా నమోదైన నేపథ్యంలో గ్రామాలకు నేరుగా వెళ్లి ప్రజల్లో అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.

# బీజేపీలో కీలక మార్పులు

### ఐలేష్‌పై కార్యకర్తల ఫిర్యాదులు.. యాదగిరికి మండల పగ్గాలు

### మున్సిపల్ కన్వీనర్‌గా రాజిరెడ్డి.. ఇద్దరికీ మరోసారి కీలక బాధ్యతలు





**గుమ్మడిదల, జూలై 27(నేటి ప్రస్థానం):** గుమ్మడిదలలో భారతీయ జనతా పార్టీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ బలోపేతం, కార్యకర్తల సమస్యలు, స్థానిక నాయకత్వ పనితీరుపై సోమవారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో మండల, మున్సిపల్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కన్వీనర్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో పార్టీ బలోపేతం, కార్యకర్తలతో నాయకత్వ సమన్వయం, స్థానికంగా పార్టీ వ్యవహారాల నిర్వహణ తదితర అంశాలపై జిల్లా అధ్యక్షురాలు గోదావరి కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత మండల పార్టీ అధ్యక్షుడు కావలి ఐలేష్‌పై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ అభ్యంతరాలు, ఫిర్యాదులను జిల్లా అధ్యక్షురాలు గోదావరి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కార్యకర్తలతో సమన్వయం లోపించడం, పార్టీ వ్యవహారాల



నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యకర్తల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం మండల పార్టీ అధ్యక్ష బాధ్యతల్లో మార్పు చేపట్టాలని నిర్ణయించారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు కావలి ఐలేష్‌ను మండల పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి, చింతల యాదగిరిని నూతన మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. అదేవిధంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పార్టీ కన్వీనర్‌గా రాజిరెడ్డిని నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షురాలు గోదావరి ప్రకటించారు.

**మరోసారి కీలక బాధ్యతలు**

గతంలో పార్టీ బాధ్యతలు నిర్వహించిన చింతల యాదగిరి, రాజిరెడ్డిలకే మరోసారి కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీపై ఉన్న అనుభవం, కార్యకర్తలతో ఉన్న సంబంధాలను దృష్టిలో ఉంచుకుని వారికి బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నూతన బాధ్యతలు చేపట్టిన చింతల యాదగిరి, రాజిరెడ్డిలు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని జిల్లా నాయకత్వం సూచించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎడ్ల రమేష్, జిన్నారం వైస్ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, మండల మున్సిపాలిటీ నూతన ఇన్చార్జులు పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిన్నారంలో సేవా సంకల్పానికి శ్రీకారం

### "ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ సర్వీస్ ఫర్ సొసైటీ" ట్రస్ట్ ఏర్పాటు

### 1999--2000 పదవ తరగతి మిత్రుల ఆదర్శ నిర్ణయం -- సమాజ సేవే లక్ష్యంగా ఏకగ్రీవ తీర్మానం



**జిన్నారం మున్సిపల్, జూలై 27:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలోని ఇంద్రసేన రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 1999--2000 విద్యా సంవత్సరానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ జిన్నారం పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా సమావేశమై "ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ సర్వీస్ ఫర్ సొసైటీ" పేరుతో సేవా ట్రస్ట్‌ను స్థాపిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. స్నేహబంధాన్ని సమాజ సేవగా మలుస్తూ ప్రజలకు తమ వంతు సేవ అందించాలనే సంకల్పంతో ట్రస్ట్ ఏర్పాటుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు విద్యా సహాయం, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, మొక్కల నాటకం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు సహాయ సహకారాలు, ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు వంటి పలు ప్రజాహిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని నిర్ణయించారు.అదేవిధంగా ట్రస్ట్‌ను చట్టబద్ధంగా నమోదు చేసి పూర్తి పారదర్శకతతో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, సభ్యత్వ నమోదు చేపట్టి ప్రజల భాగస్వామ్యంతో సేవలను మరింత విస్తరించాలని సమావేశంలో తీర్మానించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ నూతన చైర్మన్ అంతిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ శ్వేతా రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి. బ్రహ్మేందర్ గౌడ్ తో పాటు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.... "1999--2000 బ్యాచ్ స్నేహాన్ని సేవా బంధంగా మార్చి సమాజానికి శాశ్వతంగా ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడమే మా లక్ష్యం. రానున్న రోజుల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి మా వంతు బాధ్యతను నిర్వర్తిస్తాం" అని తెలిపారు.జిన్నారం 1999--2000 పదవ తరగతి పూర్వ విద్యార్థులు సమాజ సేవకు నూతన దిశగా అడుగులు వేయడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ఈ సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

**ఫ్రెండ్స్ ఫర్ లైఫ్.... సర్వీస్ ఫర్ సొసైటీ ట్రస్ట్ నూతన కార్యవర్గం**

1).సలహాదారులు: డా.ఏర్పుల శ్రీనివాస్.
2).చైర్మన్: అంతి రెడ్డి గారి రాఘవేందర్ రెడ్డి.
3).మహిళ వైస్ చైర్మన్:ఎస్. శ్వేత, వైస్ చైర్మన్: టి.భగవాన్ సింగ్.
4).జనరల్ సెక్రెటరీ: బి. బ్రహ్మేంధర్ గౌడ్.
5): జాయింట్ సెక్రెటరీ: యు.మమత, పి.మహేష్, టి.నర్సింగరావు,
5).ఆర్గనైజింగ్ సెక్రటరీ: టి.మహేష్, ఎల్.అంజిరెడ్డి, ఎం.వీరేశం,
6).కల్చరల్ సెక్రటరీ: ఎస్. ప్రవీణ్ కుమార్. వి.భాస్కర్,
7). ట్రెజరర్: పి.మమత.
8).ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్: పి.నవీన్ కుమార్,కే. గణేష్, బి.మహేశ్వరి,డి.భాస్కర్, ఏ.ఆనంద్ కుమార్, ఎస్.ప్రతాప్ రెడ్డి,ఎం.శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# రైతు సమస్యలపై పోరాటాలకు శ్రీకారం చుట్టనున్న జాతీయ మహాసభలు




అన్నారం గ్రామంలో రైతులతో మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

**మిర్యాలగూడ జూలై 27::** నవంబర్ నెలలో మొట్టమొదటిసారిగా నల్గొండ కేంద్రంలో జాతీయ రైతు మహాసభలు జరగనున్నాయని దానికి రైతాంగం ఆర్థిక హార్దిక సహాయాలను అందజేయాలని సభలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, రైతు సంఘం జాతీయ నాయకులు మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామంలో పొలాల్లో నాట్లు వేస్తున్న రైతాంగం దగ్గరికి వెళ్లి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని రైతాంగాన్ని కలిసి మహాసభలకు ఆర్థికంగా సహాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గాలాలు కష్టించి పని చేసిన రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమైనాయన్నారు. ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి రైతును రాజు చేస్తామని ప్రకటనలు చేయడం తప్ప వారికి చేసింది శూన్యమన్నారు. రుణమాఫీ చేస్తామని బూర్జువ పార్టీలు ఉపన్యాసాలతో ప్రజలను ఆకట్టుకుని అధికారం వచ్చిన తర్వాత దాని గురించి ప్రస్తావించకుండా వాగ్దానాలను విస్మరిస్తారని విమర్శించారు. వ్యవసాయానికి ఉచిత కరెంటు ఇస్తామని మాట ఇచ్చి దాన్ని అమల్లో అనేక సందేహాలను వెలిబుచ్చుతూ మాట తప్పే ఆలోచన చేస్తున్నారని దీన్ని చూస్తూ రైతాంగం సహించబోదని వారు హెచ్చరించారు. రైతు లేనిది అభివృద్ధి జరగదని వారిని బుజ్జగిస్తున్నారు తప్ప వారికి పెన్షన్ గాని భరోసా సౌకర్యాలు కానీ కల్పించకపోవడం శోచనీయమన్నారు. రైతుల ఎదుర్కొంటున్న ఇలాంటి సమస్యలపై జాతీయ స్థాయిలో జరిగే మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేసి సమరశీల పోరాటాలకు సమాయత్తం చేయనున్నట్టు వారు తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిన నలగొండ జిల్లాలో మహాసభలు జరపాలని ఆలోచన జాతీయ రైతు సంఘం చేసిందన్నారు. మొట్ట మొదటిసారిగా నల్గొండలో జాతీయ మహాసభల సందర్భంగా రైతులు తమకు తోచిన విధంగా సహకరించి మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డబ్బుకార్ మల్లేష్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు రాష్ట్ర కమిటీ సభ్యులు మంగారెడ్డి మండల కార్యదర్శి ఎం.రవి నాయక్, నాయకులు అప్పారావు, అన్నారం గ్రామంలో కాంతారెడ్డి ఉమాకాంత్ రెడ్డి వెంకట్ రెడ్డి కోటిరెడ్డి బెనర్జీ కన్యా నాయక్ రైతులు మహాసభల జయప్ర దానికి సహకరించాలన్నారు..



# టీనేజ్ గర్భధారణలు,బాల్య వివాహాల నివారణకు ఐసీడీఎస్ కార్యాచరణ

ప్రత్తిపాడులో సీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో బాలల రక్షణ చట్టాలపై అవగాహన..

సీఎంపివోలు,వీసీపీసి సభ్యుల సమీక్ష సమావేశం

శాఖల సమన్వయంతో గ్రామస్థాయి పర్యవేక్షణకు సూచనలు

**ప్రత్తిపాడు,జులై,27:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో యుక్తవయస్సు గర్భధారణలు,బాల్య వివాహాల నివారణ,బాలల రక్షణ చట్టాలపై మండల స్థాయి సమీక్ష సమావేశం,అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలల రక్షణ,మహిళా శిశు సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,ప్రత్తిపాడు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగుల నాని,బీజేపీ నాయకులు సింగిలిదేవి సత్తిరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మండల స్థాయి,గ్రామస్థాయి బాల్య వివాహాల నిరోధక,పర్యవేక్షణ కమిటీ సభ్యులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో యుక్తవయస్సు గర్భధారణలు,బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు,శాఖల మధ్య సమన్వయం,గ్రామస్థాయిలో పర్యవేక్షణ,అనుమానాస్పద బాల్య వివాహాలను ముందస్తుగా గుర్తించి అడ్డుకునే విధానాలు,సంబంధిత చట్టాల అమలు,ప్రజల్లో అవగాహన కల్పించే కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కొమ్ముల కన్నబాబు మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం,బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం,గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టం,లింగ వివక్ష నిరోధక నిబంధనలు బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.వెలుగుల నాని మాట్లాడుతూ గ్రామస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి టీనేజ్ గర్భధారణలు,బాల్య వివాహాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.సింగిలిదేవి సత్తిరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులకు బాలల భవిష్యత్తు,చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే సంబంధిత సహాయవాణి నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల తహసీల్దార్ ఎం సూర్యప్రభ,మండల అభివృద్ధి అధికారి ఎంవీఆర్.కుమార్ బాబు,ప్రత్తిపాడు సీఐ బి సూర్య అప్పారావు,ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం,రాచపల్లి,శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ గీతాసుధ,డాక్టర్ రాంకుమార్,ఎంఈఓ-2 వై అచ్చిరాజు,ఏపీఎం వెంకట్,జిల్లా బాలల పరిరక్షణ శాఖ ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ,మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది,అంగన్‌వాడీ సిబ్బంది,మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం సందర్భంగా నర్సాపూర్‌లో భారీ అవగాహన ర్యాలీ

సీజేఆర్ సర్కిల్ నుంచి సెయింట్ డాన్ బోస్కో హై స్కూల్ వరకు విద్యార్థులతో సందడి




**నర్సాపూర్, జూలై 27:** పర్యావరణ పరిరక్షణ, హరితహారం ప్రాముఖ్యతను ప్రజల్లో చాటిచెప్పేందుకు వన మహోత్సవం సందర్భంగా నర్సాపూర్ పట్టణంలో సోమవారం భారీ అవగాహన ర్యాలీ ఘనంగానిర్వహించారు. సీజేఆర్ సీజెర్ సర్కిల్ నుంచి సెయింట్ డాన్ బోస్కో హై స్కూల్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజు యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఉత్సాహంగా నడిచారు.ర్యాలీ సందర్భంగా విద్యార్థులు చేతుల్లో మొక్కలు,పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్లకార్డులు పట్టుకుని "ఒక్కో ఇంటికి ఒక మొక్క", "చెట్లు నాటుదాం -- భవిష్యత్తును కాపాడుదాశీ,"హరితహారం -- మనందరి బాధ్యత" వంటి నినాదాలతో పట్టణ ప్రజల్లో పర్యావరణంపై చైతన్యం కల్పించారు. ర్యాలీ సాగిన మార్గమంతా విద్యార్థుల నినాదాలు ఆకట్టుకోగా, స్థానిక ప్రజలు కూడా వారిని అభినందించారు.అనంతరం సెయింట్ డాన్ బోస్కో హై స్కూల్ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజు యాదవ్ మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతిని పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. చెట్లు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా వర్షాలు కురిసేందుకు, వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించేందుకు ఎంతో కీలకమని వివరించారు.ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దానిని పెద్ద చెట్టుగా పెంచే బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అత్యంత ముఖ్యమని, ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాల్లో హరిత వాతావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహనపెం పొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వన మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతను పెంపొందించడంతో పాటు ప్రజలకు కూడా మంచి సందేశాన్ని అందించిందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొని వన మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# అనంతారం భూములపై ఆంక్షలెందుకు..?

ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉన్న భూములపై స్పష్టత ఇవ్వాలి.. రైతుల సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలి

- రైతుల భూముల సమస్యపై అధికారులు తక్షణమే స్పష్టత ఇవ్వాలి: చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



**గుమ్మడిదల, జూలై 27 (నేటి ప్రస్థానం):** గుమ్మడిదల మండలం అనంతారం గ్రామ పరిధిలోని భూముల సమస్యను ప్రభుత్వం, అధికారులు వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. అనంతారం గ్రామంలోని సర్వే నంబర్ 173, 174లోని భూములను ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉంచడంతో ఆయా భూముల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సోమవారం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతారం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 173లో 59 ఎకరాలు, సర్వే నంబర్ 174/1 నుంచి 174/10 వరకు 110 ఎకరాల భూమి ఉందని, ఈ భూముల విషయంలో నెలకొన్న సమస్యకు అధికారులు తక్షణమే తెరదించాలని గోవర్ధన్ రెడ్డి కోరారు. ఆయా భూములు ప్రభుత్వ భూములా, పట్టా భూములా, అసైన్డ్ భూములా అనే అంశంపై అధికారులు సమగ్రంగా పరిశీలించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూముల వాస్తవ పరిస్థితిని, రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హత కలిగిన భూములను ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి తొలగించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. భూములు ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉండటంతో రైతులు రిజిస్ట్రేషన్, క్రయవిక్రయాలు, ఇతర అవసరాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు సమస్యకు పరిష్కారం లభించకపోవడం బాధాకరమని అన్నారు. రైతులు తమ భూముల విషయంలో స్పష్టత కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. రైతుల భూముల సమస్యను కేవలం కార్యాలయాల చుట్టూ తిప్పకుండా రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి, భూముల వాస్తవ స్థితిపై స్పష్టమైన నివేదిక రూపొందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు కూడా బాధిత రైతులకు అండగా నిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి అనంతారం భూముల సమస్యను పరిష్కరించకపోతే బాధిత రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. భూములపై నెలకొన్న అనిశ్చితికి తెరదించి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఏలూరులో ఇంటింటికీ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ.. కూటమి పాలనపై ప్రచారం

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం,అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాల పంపిణీ

45 రోజుల ప్రచార కార్యక్రమానికి శ్రీకారం

ఘన స్వాగతం పలికిన స్థానిక నాయకులు అడ్డాల త్రిమూర్తులు,రొంగల సత్యనారాయణ



**ప్రత్తిపాడు, ప్రతినిధి,జులై,27:-** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు.ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబి కూటమి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు.ఇంటింటి ప్రచారానికి గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే సత్యప్రభకు స్థానిక టీడీపీ నాయకులు అడ్డాల త్రిమూర్తులు,రొంగల సత్యనారాయణ ఆధ్వర్యంలో మహిళలు,గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.గ్రామ వీధుల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే సత్యప్రభ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు.సూపర్ సిక్స్ హామీల అమలు ద్వారా సంక్షేమాన్ని పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.నేటి నుంచి 45 రోజుల పాటు గ్రామాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,నాయకులు అడ్డాల త్రిమూర్తులు,రొంగల సత్యనారాయణ,గొంతిన సురేష్,మంతెన వెంకటరమణ, మిరియాల శ్రీను,సత్యంశెట్టి సీతబాబు,ఇళ్ల అప్పారావు, లొండ లోవరాజు,బొల్లు కొండబాబు,వెలుగుల నాని, బొల్లు చిన్నా,జువ్విన తిరుపతిరావు,తూము కొండబాబు పోల్నాటి భగవాన్,తటవర్తి సుబ్బారావు,యర్రాబత్తుల గోవిందు నాయుడు,దాకారపు కృష్ణ,రామకుర్తి కామేష్,శిరం శ్రీను తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రతిభా పురస్కారం అందుకున్న డాక్టర్: చంద్ర ప్రసాద్




**తణుకు, జూలై 27.:** పశ్చిమగోదావరి జిల్లాలో స్వాతంత్రానికి పూర్వమే 1945 లో స్థాపించబడిన ప్రతిష్టాత్మకమైన డిఎన్ఆర్ కళాశాలలో ప్రిన్సిపల్ గా పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఢిల్లీలో అవార్డు అందుకు న్నారు. విద్యారంగంలో అవిశ్రాంతంగా బోధనా పరిశోధనలు చేస్తూ అనేక మందిని ఉత్తమ పౌరులుగా ఔత్సాహిక పారి శ్రామిక వేత్తలుగా తీర్చిదిద్ది విద్యా రంగా నికి అందిస్తున్న సేవలకు గాను డాక్టర్ :జె చంద్ర ప్రసాద్ కు శత చిత్ర చలన చిత్ర దర్శకుడు దివంగత కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా హైదరాబాదులోని ప్రసాద్ ఫిలిం స్టూడియోస్ లో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో భాగంగా కోడి రామకృష్ణ పేరు మీద అందించే ప్రతిభా పురస్కారాన్ని తణుకు వాస్తవ్యులు డాక్టర్ జగదీష్ చంద్ర ప్రసాద్ కి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు చేతులు మీదుగా సినీ నటులు పద్మశ్రీ మురళీమోహన్ ,సుమన్, బాబు మోహన్ వారి సమక్షంలో కోడి రామకృష్ణ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోడి రామకృష్ణ జయంతి కమిటీ నిర్వాహకులు రమా సత్యనారాయణ ముచ్చటిస్తూ చంద్ర ప్రసాద్ గత 50 సంవత్సరాలుగా అనేక ఉన్నత విద్యాసంస్థల నిర్వహణ స్థాపనతోనే కాకుండా అక్షరాన్ని ఆయుధముగా చేసుకుని వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన గనులని విద్య ద్వారా డిగ్రీలు సాధించి ఉద్యోగాలు సాధించడమే కాక ఉద్యోగాలు ఇచ్చే స్థాయిగల ఎంటర్ప్రైజర్ గా ఎదిగి ఆర్థిక వ్యవస్థకు అండగా నిలబడాలని జీవ నైపుణ్యాలు పెంపొందిస్తూ వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడేవారని 60 మందికి పైగా పరిశోధనా విద్యార్థులకు గైడ్ గా వ్యవహరించి వారు పీ హెచ్ డీ సాధించడానికి కృషి చేశారని ,135 పైగా పరిశోధనా వ్యాసాలు వివిధ జర్నర్స్లలో ప్రచురించడమే కాకుండా దేశంలోని వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించిన 96 జాతీయ అంతర్జాతీయ సెమినార్లో పరిశోధనా వ్యాసాలు సమర్పించి ఆయన వాణిని వినిపించారు. ఆర్థికంగా విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులకు ఆయన చేయూత ప్రేరణ మరువరానిదని కొనియాడారు, మాటీవీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ మురళీ కృష్ణంరాజు నవలా రచయిత సూర్యదేవర రామ్మోహన్ రావు, ప్రస్తుత శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్ వి ఆర్ జ్యోతి కుమార్, మాజీ మంత్రులుగా పనిచేసిన కటారు ఈశ్వర్ కుమార్,మేరుగు నాగార్జున,సినీ డైరెక్టర్స్ రాజా వన్ రెడ్డి, ఎస్ వి కృష్ణారెడ్డి, వంటి వారు కూడా డా. చంద్ర ప్రసాద్ వద్ద ఉన్నత విద్య నభ్య శించిన వారే రానున్న కాలంలో కూడా విద్యా వ్యవస్థకు విద్యార్థి లోకానికి పరిశోధనా రంగానికి ఆయన సేవలు అందించగల శక్తి సామర్థ్యాలు ఉన్నవని తెలియజేశారు.

# అబ్దుల్ కలాం జీవితం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం

పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరులో ఘనంగా మిస్సైల్ మాన్ అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు




**పటాన్ చెరువు,:** అత్యంత సామాన్య కుటుంబం నుండి జీవితాన్ని ప్రారంభించి.. భారతదేశ అత్యున్నత రాష్ట్రపతి పదవి చేపట్టడంతో పాటు రక్షణ రంగంలో మిస్సైల్ మెన్ గా గుర్తింపు పొందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గల అబ్దుల్ కలాం కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే జీఎంఆర్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. అబ్దుల్ కలాం ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న సమున్నత లక్ష్యంతో ప్రత్యేకంగా కేజీ టు పీజీ విద్యా ప్రాంగణంలోనే ఆయన కాంస్య విగ్రహాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రతిరోజు ఆయన విగ్రహాన్ని చూసినప్పుడల్లా ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నేటితరం విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాలను తరిమికొట్టాల్సిన గురుతర బాధ్యత విద్యార్థి లోకంపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, అశోక్, పృథ్వీరాజ్, వెంకటేష్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## క్రెటా సమ్మర్ ఎడిషన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటర్..దేశీయ మార్కెట్లోకి సమ్మర్ ఎడిషన్‌గా క్రెటాను విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.12 లక్షలుగా నిర్ణయించింది. పుష్ బటన్‌తో స్టార్ట్ కానున్న ఈ కారు ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, 26 ఇంచుల డిజిటల్ క్లస్టర్ టచ్‌స్క్రీన్, డ్యాష్‌కామ్ రికార్డింగ్ మోడ్స్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది. ఈ సందర్భంగా హ్యుందాయ్ మోటర్ ఇండియా నేషనల్ హెడ్ సునీల్ మూల్‌చందాని మాట్లాడుతూ..దేశీయ ఎస్‌యూవీ మార్కెట్లో తనదైన ముద్ర వేసిన క్రెటాకు దేశవ్యాప్తంగా 14 లక్షల కస్టమర్లు ఉన్నారని, అలాగే గడిచిన ఆర్థిక సంవత్సరంలో రెండు లక్షలకు పైగా యూనిట్లు అమ్ముడయ్యాయన్నారు. దశాబ్దకాలం క్రితం దేశీయ రోడ్లపైకి అడుగుపెట్టిన ఈ క్రెటా మాడల్ 1.51 ఎంపీఐ పెట్రోల్ ఇంజిన్, 1.51 యూ2 సీఆర్‌డీఐ డీజిల్ ఇంజిన్‌తో తీర్చిదిద్దినట్టు ఆయన చెప్పారు.జుఅస్త్రఱఅవ �d ఎత్తుఖఅంఎఱంంఱశీఅ

## టైర్ల ధరలకు రెక్కలు!

### మూడు శాతం వరకు సవరించిన యోకోహామా

హైదరాబాద్: టైర్ల ధరలకు రెక్కలొచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇప్పటికే పలు ఉత్పత్తుల భగ్గుమంటుండటంతో తాజాగా టైర్లు కూడా ఈ జాబితాలోకి చేరాయి. జపాన్‌కు చెందిన ప్రముఖ టైర్ల తయారీ సంస్థ యోకోహామా ధరలను భారీగా పెంచేసింది. ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ముడిసరుకులైన రబ్బర్, కార్బన్ బ్లాక్, కెమికల్స్, నైలాన్, పాలిస్టర్‌తోపాటు పెట్రోలియం డెరివేటివ్ ఉత్పత్తుల ధరలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో టైర్ల ధరలను మూడు శాతం వరకు సవరించాల్సి వచ్చిందని కంపెనీ మార్కెటింగ్ హెడ్ గౌరవ్ మహాజన్ తెలిపారు. ఈ ఉద్రిక్త పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరోసారి ధరల పెంపు తప్పదని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. యుద్ధం ప్రభావంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ధరలను తప్పని పరిస్థితుల్లో స్వల్పంగా పెంచాల్సి వచ్చిందన్నారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా చమురు దిగుమతులు భారీగా తగ్గడంతో టైర్ల తయారీ సంస్థలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి రావచ్చునని ఆయన పేర్కొన్నరుదేశీయంగా టైర్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టి పెట్టుకొని భారత్‌లో ఇప్పటి వరకు రూ.1,500 కోట్ల పెట్టుబడితో రెండు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పినట్టు చెప్పారు. వీటిలో రూ.750 కోట్లతో ఒకటి హరియాణాలో నెలకొల్పగా, మరొకటి రూ.750 కోట్లతో వైజాగ్‌లో గతేడాది ప్రారంభించింది. వైజాగ్‌లో నెలకొల్పిన ప్లాంట్ కెపాసిటీ 17 లక్షల యూనిట్లు అయినప్పటికీ ఇప్పటి వరకు రెండింట మూడోవంతు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం సంస్థ 12 ఇంచుల నుంచి 20 ఇంచుల కెపాసిటీ కలిగిన టైర్లను తయారు చేసి, విక్రయిస్తున్నది. ప్రధానంగా దేశీయంగా ఎస్‌యూవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని టైర్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుకున్నట్టు ప్రకటించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధి నమోదైందని, కానీ ఈసారి మాత్రం తగ్గే అవకాశాలున్నాయన్నారు. దేశవ్యాప్తంగా 3,300 టచ్‌పాయింట్లు ఉండగా, వీటిలో 800 ప్రత్యేక అవుట్‌లెట్లను నెలకొల్పింది. కంపెనీ ఉత్పత్తులు ప్రస్తుతం సార్క్ దేశాలతోపాటు ఆఫ్రికా దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నది.

## కోటక్, యాక్సిస్.. న్యూఫండ్ ఆఫర్స్



కోటక్ మహీంద్రా ఏఎంసీ తాజాగా మల్టీ అసెట్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్)ని ఆవిష్కరించింది. ఇందులో ఏప్రిల్ 22 వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. కనీస పెట్టుబడి మొత్తం రూ. 1,000గా ఉంటుంది. ఈక్విటీ, డెట్, కమోడిటీ ఆధారిత స్కీముల యూనిట్లలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా రిస్న?కకు తగ్గట్లుగా మరింత మెరుగైన రాబడులను అందించడం ఈ ఫండ్ లక్ష్యంగా ఉంటుంది. ఒకే ఫండ్ ద్వారా డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను పొందేందుకు ఇది ఉపయోగపడగలదని సంస్థ ఎండీ నీలేశ్ షా తెలిపారు. యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ డిఫెన్స్ ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో)ను ప్రారంభించింది. ఈ నెల 24 వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. కనీసం రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రక్షణ రంగానికి కేంద్రం ఎంతో ప్రా ధాన్యం ఇస్తుండడం తెలిసిందే. దేశీయంగానే అత్యాధునిక ఆయుధాల అభివృద్ధి, తయారీ దిశగా పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. మారిన ప్రపంచ క్రమంలో రక్షణ రంగానికి పెద్ద మొత్తంలో కేటాయింపులు చేస్తోంది. 2013--14 నుంచి చూస్తే రెండున్నర రెట్లు పెరిగి 2025--26 నాటికి రూ.6.8 ల క్షల కోట్లకు కేటాయింపులు పెరిగాయి. దీంతో రక్షణ రంగంలోని కంపెనీలు దీర్ఘ కాలానికి మెరుగైన అవకాశాలు కల్పిస్తుండడంతో ప్రత్యేకంగా డిఫెన్స్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టుకోవాలని భావించే ఇన్వెస్టర్లకు ఈ ఫండ్‌ను ప్రారంభించింది.

# వాహన విక్రయాలు.. టాప్‌గేర్

## 2025--26లో రిటైల్ సేల్స్ 13% జంప్..2.96 కోట్ల యూనిట్లతో ఆల్‌టైమ్ రికార్డు

న్యూఢిల్లీ: వాహన రిటైల్ విక్రయాలు గత ఆర్థిక సంవత్సరం (2025--26)లో 13% పెరిగినట్లు ఆటో డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. ఏడాది ఆరంభంలో ఆటోమొబైల్ రంగంలో డిమాండ్ కొంత మేర తగ్గినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 అమలుతో విక్రయాలు వేగవంతమయ్యాయని ఫాడా తెలిపింది. సెప్టెంబర్ నుంచి ప్రారంభమైన పండుగల సీజన్‌లో నవరాత్రి, దీపావళి ఒకే కాలంలో రావడంతో అక్టోబర్‌లో నెలవారీ రిటైల్ విక్రయాలు 40 లక్షల యూనిట్లను దాటి ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేశాయి. ఈ ఉత్సాహం తరువాతి నెలల్లోనూ కొనసాగింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతి నెల కూడా రెండంకెల (డబుల్ డిజిట్) వార్షిక వృద్ధి నమోదైంది. దీంతో ఈ వృద్ధి కేవలం పండుగల ప్రభావం మాత్రమే కాకుండా, నిర్మాణాత్మకంగా బలపడినట్లు స్పష్టమైంది. అన్ని విభాగాల్లో కలిపి వాహన రిటైల్ విక్రయాలు 2,61,87,255 (2024--25) నుంచి 13 శాతం వృద్ధితో 2,96,71,064 యూనిట్లకు చేరాయి.

**జీఎస్‌టీ 2.0 అమలుతో బూస్ట్: ఫాడా అధ్యక్షుడు**

భారత ఆటో రిటైల్ రంగం 2025--26 ఆర్థిక సంవత్సరంలో చరిత్రాత్మక ప్రదర్శన కనబర్చిందని ఫాడా అధ్యక్షుడు సీ.ఎస్.విఘ్నేశ్వర్ తెలిపారు. మొత్తం 2.96 కోట్లకు పైగా వాహనాలు విక్రయంతో ఆటో రంగం కొత్త గరిష్ట స్థాయిని చేరిందన్నారు. ఈ వృద్ధి కేవలం సంఖ్యల పరంగానే కాకుండా, పరిశ్రమ 3కోట్ల మార్క్‌కు చేరువవుతోందని సూచిస్తోందన్నారు. పట్టణాలు, గ్రామీణ



ప్రాంతాల్లో పెరుగుతున్న మొబిలిటీ అవసరం, మెరుగైన కొనుగోలు సామర్థ్యం, వివిధ ఇంధన సాంకేతికతల విస్తరణ ఈ వృద్ధికి బలమైన పునాదిగా నిలిచాయని వివరించారు. అయితే, ఏడాది మొత్తం వృద్ధి సమానంగా కొనసాగలేదన్నారు. గత ఏడాది ఇన్వెంటరీ సమస్యలు, ఫైనాన్సింగ్ పరిమితులు, వినియోగదారుల 'వెయిట్ అండ్ వాచ్' ధోరణి కారణంగా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు విక్రయాలు మోస్తరుగా ఉన్నాయని తెలిపారు. అయితే, సెప్టెంబర్లో అమలైన జీఎస్‌టీ 2.0తో పరిస్థితి మారిందని, చిన్న వాహనాలు, ద్విచక్ర వాహనాలపై పన్ను తగ్గడంతో కొనుగోలు సామర్థ్యం పెరిగి డిమాండ్ ఊపందుకుందని వెల్లడించారు.

**అప్రమత్తతతో కూడిన ఆశావాద దృక్పథం: ఫాడా**

పశ్చిమాసియా పరిస్థితుల్లో మార్పులు భారత ఆటో రిటైల్ రంగంపై కీలక ప్రభావం చూపవచ్చని ఫాడా పేర్కొంది. ఇంధన ధరలు, సరఫరా లభ్యత, వినియోగదారుల విశ్వాసం ఆటో రంగం దిశను నిర్ణయించే ప్రధాన అంశాలుగా మారనున్నాయని తెలిపింది. తాజా సర్వే ప్రకారం, 53.2 శాతం డీలర్లు సరఫరా లేదా డిస్పాచ్‌లో అంతరాయాలను ఎదుర్కొన్నట్లు వెల్లడైంది. వీరిలో 17.1 శాతం డీలర్లు మూడు వారాలకుపైగా గణనీయమైన జాప్యాలు (కంపెనీల నుంచి డీలర్లకు వాహనాల సరఫరాలో ఆలస్యం) నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ ప్రభావం ముఖ్యంగా వాణిజ్య వాహనాల విభాగంలో ఎక్కువగా కనిపించింది. అలాగే ప్యాసింజర్ వాహనాలు (పీవీ), ద్విచక్ర వాహనాల (టూ వీలర్స్) డీలర్లు కూడా కొన్ని మోడళ్లలో ఆలస్యాలు ఉన్నట్లు తెలిపారు.



## ఇన్వెస్టర్ల మనసంతా ఆ ఇన్వెస్టింగ్‌పైనే..

ముంబై: పారదర్శకమైన, తక్కువ వ్యయాలతో కూడుకున్న ఇండెక్స్ ఇన్వెస్టింగ్‌పై మదుపర్లలో ఆసక్తి పెరుగుతోందని యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఇందుకు అనుగుణంగా తమ సంస్థ వివిధ సూచీల ఆధారిత ఫండ్స్‌ని అందిస్తున్నట్లు వివరించింది. 2026 ఫిబ్రవరి 28 నాటికి వీటిలో నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ ఏయూఎం రూ. 849 కోట్లకు, 100 ఇండెక్స్ ఫండ్ ఏయూఎం రూ. 1,983 కోట్లకు చేరినట్లు తెలిపింది. 2022 జనవరిలో ప్రవేశపెట్టిన నిఫ్టీ నెక్స్ట్ 50 ఫండ్ గణనీయంగా వృద్ధి చెందుతోందని పేర్కొంది. ఇవి లార్జ్ క్యాప్ మొదలుకుని వివిధ స్థాయుల్లో మార్కెట్‌కి ప్రాతినిధ్యం వహించే, భవిష్యత్తులో లీడర్లుగా ఎదిగే సామర్థ్యాలున్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉపయోగపడతాయని సంస్థ తెలిపింది.యాక్టివ్‌గా మేనేజ్ చేసే ఫండ్స్‌తో పోలిస్తే, ఇండెక్స్ ఫండ్స్‌లో హ్యూమన్ ఎర్రర్ (నిర్ణయాల్లో పొరపాట్లు) తక్కువగా ఉండటం వల్ల దీర్ఘకాలంలో స్థిరమైన రాబడులను ఆశించే ఇన్వెస్టర్లు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా కొత్త తరం ఇన్వెస్టర్లు తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో (నిర్వహణ వ్యయం) కలిగిన ప్యాసివ్ ఇన్వెస్టింగ్ పద్ధతులపై అవగాహన పెంచుకుంటున్నారు.

## రెమిటెన్స్‌లపై యుద్ధం పిడుగు



ముంబై, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దేశీయ రెమిటెన్స్‌లపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం పడనున్నదని సర్వే సంస్థలు అంచనావేస్తున్నాయి. దేశంలోకి వచ్చే విదేశీ రెమిటెన్స్‌ల్లో మూడోవంతు గల్ఫ్ దేశాల నుంచి వస్తుండటం ఇందుకు కారణమని దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ రేటింగ్స్ వెల్లడించింది. విదేశాల్లో ఉన్న ప్రవాసుల ఆదాయ వనరులు తగ్గుముఖం పట్టడం కూడా రెమిటెన్స్‌లు తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి 135 బిలియన్ డాలర్ల విలువైన రెమిటెన్స్‌లు వచ్చాయి. అంతక్రితం ఏడాది వచ్చిన రెమిటెన్స్‌లతో పోలిస్తే రెండంకెలు వృద్ధి నమోదైంది. మరోవైపు, ప్రపంచ దేశాల్లో వాణిజ్య యుద్ధ భయాలు కూడా దేశీయ ఎగుమతుల్లో వృద్ధి అంతంత మాత్రంగానే నమోదైందని పేర్కొంది. మరోవైపు, క్రూడాయిల్ ధరలు భగ్గుమనడంతో దిగుమతి కోసం చెల్లించే బిల్లులు 8-9 శాతం వరకు అధికంకానున్నట్టు అంచనావేస్తున్నది. సంఘర్షణ కారణంగా ఏర్పడిన రవాణా పరమైన సవాళ్లు, సరఫరా వ్యవస్థలో నెలకొన్న అవాంతరాలు పశ్చిమాసియా ఎగుమతులపై ప్రభావితం చూపనున్నాయని నివేదిక వెల్లడించింది. భారత్ నుంచి గల్ఫ్ కో-ఆపరేషన్ కౌన్సిల్ దేశాలకు 57 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరిగాయి. మొత్తం దేశీయ ఎగుమతుల్లో వీటి వాటా 13 శాతంగా ఉన్నది. అలాగే పశ్చిమాసియా దేశాలకు 9 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. జీసీసీ దేశాల్లో బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాలు ఉండగా, పశ్చిమాసియా దేశాల్లో ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్, సిరియా, యెమెన్ దేశాలు ఉన్నాయి. మొత్తం ఎగుమతుల్లో 70 శాతం బాస్మతి బియ్యం అవుతుండగా, 25 శాతం సెరామిక్స్, 15 శాతం పెట్రోలియం ఉత్పత్తులు, 20 శాతం జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఉన్నాయి.

## కొరియా చిన్నది.. కోట్ల సంపదలో పెద్దది!!

సాంకేతిక రంగం అంటేనే సృజనాత్మకతకు, అపారమైన సంపదకు నిలయం. తాజాగా ఈ రంగంలో ఒక అరుదైన రికార్డు నమోదైంది. దక్షిణ కొరియాకు చెందిన 22 ఏళ్ల కిమ్ జంగ్-యున్ (ఖఱఎ జీబఅస్త్ర-ఎశీబఅ) ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలైన మహిళా టెక్ బిలియనీర్‌గా ఫోర్బ్స్-2026 జాబితాలో నిలిచారు. గేమింగ్ రంగంలో ఆమె కుటుంబం సృష్టించిన సామ్రాజ్యం, నేడు ఆమెను ఈ అత్యున్నత స్థానంలో నిలబెట్టింది.

**వారసత్వ సంపద.. అంతర్జాతీయ గుర్తింపు**

గేమింగ్ దిగ్గజం 'నెక్సాన్' (చీవఞశీఅ) వ్యవస్థాపకుడు, దివంగత కిమ్ జంగ్-జు కుమార్తె జంగ్-యున్. 2022లో తన తండ్రి మరణం తర్వాత, నెక్సాన్ హోల్డింగ్ కంపెనీ అయిన చీశజలో ఆమెకు, ఆమె సోదరి జంగ్-మిన్‌కు భారీగా వాటాలు దక్కాయి. ఫోర్బ్స్ తాజా గణాంకాల ప్రకారం, ఏప్రిల్ 12, 2026 నాటికి జంగ్-యున్ నికర ఆస్తి విలువ 1.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.12,520 కోట్లు)

ప్రస్తుతం ఆమె దక్షిణ కొరియాలోని జెజు ద్వీపంలో



నివసిస్తున్నారు. సంపద పరంగా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, ఆమె వ్యక్తిగత జీవితం, సంస్థ నిర్వహణ విషయాల్లో చాలా గోప్యంగా ఉండటానికే మొగ్గు చూపుతారు.

**నెక్సాన్.. గేమింగ్ రంగంలో ట్రెండ్ సెట్టర్**

1994లో ప్రారంభమైన నెక్సాన్, ఆన్‌లైన్ గేమింగ్ ప్రపంచంలో ఒక విప్లవాన్ని తీసుకొచ్చింది. మాపుల్ స్టోరీ (మీుజూశ్రీమాశీతీఎ), దంజియన్ d ఫైటర్ (ణబఅస్త్రవశీఅ d ఖీఅస్త్రష్ట్రవతీ) వంటి ప్రపంచ ప్రసిద్ధ గేమ్స్ ఈ సంస్థ ఖాతాలో ఉన్నాయి. ఏటా బిలియన్ల కొద్దీ ఆదాయాన్ని ఆర్జిస్తూ, ఆసియా డిజిటల్ గేమింగ్ మార్కెట్‌లో నెక్సాన్ తిరుగులేని శక్తిగా ఎదిగింది. ఈ బలమైన పునాదే నేడు జంగ్-యున్ సంపదకు ప్రధాన వనరు.

**2026లో యువ బిలియనీర్ల హవా**

ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, ఈ ఏడాది 30 ఏళ్లలోపు వయస్సున్న బిలియనీర్ల సంఖ్య 35కు చేరింది. వీరి మొత్తం ఆస్తి విలువ సుమారు 92.4 బిలియన్ డాలర్లు. వీరిలో అత్యధికులు వారసత్వంగా ఆస్తులు పొందిన వారే అయినప్పటికీ, AI (కృత్రిమ మేధ) వంటి రంగాల్లో సొంతంగా ఎదిగిన వారు (Self-made) కూడా 12 మంది ఉండటం విశేషం. టెక్ రంగంలో జంగ్-యున్‌తో పాటు లువానా లోపెస్ లారా(కల్షి), లూసీ గువో (స్కేల్ ఏఐ) వంటి యువ మహిళామణులు కూడా సత్తా చాటుతున్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



## అది కొనేందుకే సినిమాల్లోకి వచ్చా'

తెలుగులో ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేసిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. ఆ తర్వాత బాలీవుడ్‌లోనూ పలు మూవీస్ చేసింది. ప్రస్తుతం రామాయణ మూవీలో కనిపించనుంది. ఇటీవల రైజింగ్ భారత్ సమ్మిట్‌కు హాజరైన రకుల్.. తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. తాను సినిమాల్లోకి రావడానికి గల కారణాన్ని వివరించింది. కేవలం కారు కొనాలనే కోరికతోనే ఇండస్ట్రీలో అడుగుపెట్టానని తెలిపింది రకుల్ ప్రీత్ సింగ్. అలా జరిగితే నా ఫ్రెండ్స్‌లో కారు కొనుక్కున్న మొదటి వ్యక్తిని నేను అవుతానని భావించానని వెల్లడించింది. అందుకే కన్నడ మూవీలో అవకాశం రాగానే ఒప్పేసుకున్నానని పేర్కొంది. ఆ సమయంలో సినీ ఇండస్ట్రీపై తనకు ఎలాంటి అవగాహన లేదని రకుల్ పంచుకుంది. రకుల్ మాట్లాడుతూ..' కాలేజీలో చదువుతున్నప్పుడే కన్నడ సినీ ఇండస్ట్రీ నుంచి అవకాశం వచ్చింది. ఎవరో నా ఫొటోలు చూసి మా నాన్నని కలిశారు. ఓ సినిమాలో నటించేందుకు నన్ను తీసుకుంటామని అడిగారు. అప్పుడు నాకేం చెప్పాలో కూడా అర్థం కాలేదు. ఆ సమయంలో సినీ ఇండస్ట్రీపై నాకు అవగాహన లేదు. అయితే ఆ సినిమాకు నాకు రూ.5 లక్షల పారితోషికం ఇస్తామని చెప్పారు. ఆ డబ్బులతో కారు కొనుక్కోవాలనుకున్నా. నా స్నేహితులందరిలో కారు ఉన్న మొదటి అమ్మాయిని నేనే అవుతా. ఆ ఒక్క కారణంతోనే సినిమా చేయడానికి అంగీకరించా' అని తెలిపింది. కాగా.. 2009లో కన్నడ చిత్రం గిల్లీతో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ.. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీ టాలీవుడ్‌లో అడుగుపెట్టింది.



## ఎన్టీఆర్ డ్రాగన్.. మరో స్టార్ నటుడి ఎంట్రీ..!

జూనియర్ ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ కాంబోలో ఓ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రాబోతోంది. ఈ మూవీకి డ్రాగన్ అనే టైటిల్ పెట్టనున్నారని ప్రచారం జరుగుతోంది. కేజీఎఫ్ తర్వాత నీల్ తెరకెక్కిస్తోన్న మూవీ కావడంతో టాలీవుడ్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్‌కు సంబంధించిన ఓ క్రేజీ టాక్ వైరలవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటుడు మనోజ్ భాజ్‌పేయి నటించనున్నారని లేటేస్ట్ బజ్ వినిపిస్తోంది. ఇప్పటికే అతన్ని మేకర్స్ సంప్రదించారని టాక్. ఓ కీలక పాత్ర కోసం మనోజ్‌ను చిత్ర యూనిట్ అడిగినట్లు తెలుస్తోంది. ఓకే అయితే వచ్చే షూటింగ్ షెడ్యూల్‌లోనే మనోజ్ ఎంట్రీ ఇస్తాడని సమాచారం. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించనుంది. కాగా.. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ మూవీకి నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ యేర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది థియేటర్లలో సందడి చేయనుంది.

## మిరాయి భామ కొరియన్ గాళ్‌గా మారితే..

### ట్రెండింగ్‌లో రితికానాయక్ స్టిల్స్

అశోకవనంలో అర్జుణ కళ్యాణం సినిమాలో సెకండ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరిసి తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది రితికా నాయక్. ఆ తర్వాత మిరాయి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఈ బ్యూటీ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టింది. వీటిలో ఒకటి డ్యుయెట్ కాగా.. మరో సినిమా కొరియన్ కనకరాజు. ఇండో-కొరియన్ హార్రర్ కామెడీ నేపథ్యంలో వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం కొరియన్ కనకరాజు మేర్లపాక గాంధీ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీ ఆగస్టు 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ భామ రీసెంట్‌గా కొన్ని ఫోటోలను నెట్టింట దర్శనమిచ్చి అందరినీ మెస్మరైజ్ చేస్తోంది. వైబ్రాంట్ ఫ్లోరల్ స్కర్ట్, వైట్ షర్ట్ వేసుకున్న రితికా నాయక్ గోల్డెన్ కలర్ జ్యువెలరీతో తళుక్కున మెరుస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. మిరాయి బ్యూటీ కొరియన్ గర్ల్‌గా మారితే ఇలా ఉంటుందని చెప్పకనే చెబుతూ కుర్రకారు గుండెలను పిండేస్తుంది రితికానాయక్. చబ్బీచబ్బీగా క్యూట్ లుక్ స్టిల్స్ సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి.



## ఆ రోజే నా సినిమా రిలీజైంది: ప్రిన్స్

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడు రమేష్‌బాబు కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'శ్రీనివాస మంగాపురం'. ఈ మూవీలో రవీనా టాండన్ కూతురు రషా తడానీ హీరోయిన్‌గా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమాకు అజయ్ భూపతి దర్శకత్వం వహిం చారు. అశ్వినీదత్ సమర్పణలో పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఇప్పటికే రిలీజైన పాటలు, ట్రైలర్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ మూవీపై టాలీవుడ్ ప్రిన్స్ మహేశ్ బాబు స్పందించారు. మా రమేశన్న వాళ్ల అబ్బాయి జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇది మా కుటుంబానికి చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. ఇప్పటి వరకు చూసిన టీజర్, సాంగ్స్, ట్రైలర్ చాలా చాలా బాగున్నాయని ప్రశంసించారు. ఈ క్రెడిట్ అంతా అజయ్ భూపతికి దక్కుతుందన్నారు. ఈ సినిమా జూలై 30న రిలీజ్ కానుంది.. అదే రోజు నా సినిమా రాజ కుమారుడు కూడా విడుదలైందని వెల్లడించారు. ఈ మూవీతో మీరంతా సక్సెస్ సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మహేశ్ బాబు ప్రత్యేక వీడియో రిలీజ్ చేశారు. ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.



## అటు అల్లు అర్జున్.. ఇటు రవితేజ?

ఆరేడేళ్ల క్రితం తెలుగులో పలు హిట్ సినిమాలు చేసిన పూజా హెగ్డే.. తర్వాత వరస డిజాస్టర్ల దెబ్బకు పూర్తిగా టాలీవుడ్‌లో కనిపించకుండా పోయింది. ఈమె నటించిన 'జన నాయగన్' రిలీజ్‌కి సిద్ధమైంది. కానీ ఇందులో ఈమె సీన్స్ పెద్దగా ఉండవని దర్శకుడు హెచ్.వినోద్ తేల్చేశాడు. మరోవైపు ఈమె 'శ్రీశ్రీ' అనే తెలుగు సినిమా చేస్తోంది గానీ ఇందులో దుల్కర్ హీరో. అయితే ఇప్పుడు ఈమెని వెతుక్కుంటూ మరో రెండు తెలుగు మూవీస్ వెళ్లాయట. 'రాకా' సినిమాతో బిజీగా ఉన్న అ?ల్లు అర్జున్.. మరోవైపు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ నటించబోతున్నాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుండగా త్వరలోనే షూటింగ్ మొదలయ్యే అవకాశముంది. ఈ మూవీలో హీరోయిన్‌గా పూజా హెగ్డేని అనుకుంటున్నారట. గతంలో బన్నీ-పూజా కలిసి దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురములో చిత్రాల్లో నటించారు. అప్పట్లో సక్సెస్ అందుకున్నారు గానీ ఇప్పుడు పూజా ఫామ్ ఏమంత గొప్పగా లేదు. మరి ఈమెని ఓకే చేస్తారా లేదా అనేది చూడాలి? మరోవైపు రవితేజ సరసన కూడా పూజా హెగ్డే ఛాన్స్ కొట్టినట్లు కనిపిస్తుంది. రవితేజ-శ్రీ విష్ణు హీరోలుగా ఓ మల్టీస్టారర్ చేస్తున్నారు. హసిత్ గోలి దర్శకుడు. ఈ ప్రాజెక్ట్ కోసం పూజాని ఓ హీరోయిన్‌గా అనుకుంటున్నారట. ఒకవేళ ఇది నిజమైతే కష్టకాలంలో ఈ బ్యూటీకి బంపర్ ఆఫర్ దొరికినట్లే.



EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/